క్లుప్తంగా

నేడు బ్రిడ్జి ప్రారంభం



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న బ్రిడ్జి

జమ్మలమడుగు : జమ్మలమడుగు–ముద్దనూర్ ప్రధాన రహదారిలో పెన్నానదిపై ఉన్న బ్రిడ్జిని శనివారం ఉదయం 10:30 గంటలకు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు జాతీయ రహదారి అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సురేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. 2021 సంవత్సరంలో మైలవరం జలాశయానికి భారీగా వరదనీరు రావడంతో బ్రిడ్జి కుంగిపోయింది.

ఘనంగా ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో ఉత్సవ మూర్తులు

వల్లూరు : పాపాఘ్ని నదీ తీరాన మండలంలోని పైడికాలువ గ్రామంలో వెలసిన శ్రీరాజ్యలక్ష్మీ సమేత చెన్న కేశవస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవ, కుంభాభిషేక మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధాన అర్చకులు స్వామి హరినారాయణ ఆధ్వర్యంలో వేద పండితులు ప్రారంభించారు. అనంతరం వివిధ హోమాలను నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందచేశారు.

మండల స్పెషల్ ఆఫీసర్‌గా మల్లికార్జున



లింగాల : లింగాల మండలం స్పెషల్ ఆఫీసర్‌గా మల్లికార్జున శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. 2000 సంవత్సరం నుంచి 2007వరకు ఆయన లింగాల ఎంపీడీఓగా పనిచేశారు. ఆ తరువాత డీఎస్‌డీఓ గాను, ప్రస్తుతం జిల్లా టూరిజం ఆఫీసర్‌గా నియమితులయ్యారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల స్పెషల్ ఆఫీసర్‌గా అదనపు బాధ్యతలు చేపట్టారు.

రేపటి నుంచి రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు

పులివెందుల టౌన్ : పట్టణంలోని అతి పురాతనమైన ఆలయం శ్రీరంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు(తిరునాల) ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయని ఆలయ చైర్మన్ సుధీకర్‌రెడ్డి, ఈఓ కేవీ రమణలు తెలిపారు. స్థానిక పూలంగళ్ల సర్కిల్ వద్ద ఉన్న శ్రీరంగనాథస్వామి కాంప్లెక్స్‌లో రంగనాథస్వామి ఉత్సవ మూర్తులతో 9 రోజులపాటు శ్రీరంగనాథస్వామి సతీ సమేతంగా రోజుకో అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారన్నారు. ఆదివారం ఉదయం అంకురార్పన అనంతరం స్వామి వారు ఉదయం సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ వాహనాలపై పురవీధులలో భక్తులకు దర్శనమిస్తారని ఆలయ అర్చకులు కృష్ణరాజేష్‌శర్మ తెలిపారు.

రేపు షిర్డిసాయిబాబాకు 108 బిందెల పాలాభిషేకం

పులివెందుల టౌన్ : స్థానిక పార్నపల్లెరోడ్డులోని షిర్డిసాయిబాబా ఆలయంలో ఆదివారం మాఘశుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు భక్తులతో 108 బిందెల పాలాభిషేకం, ప్రత్యేక హోమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త శ్రీరాంసుబ్బయ్య తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై పూజా కార్యక్రమాల్లో పాల్గొని సాయినాథుని ఆశిస్సులు పొందాలన్నారు.

రేపు విద్యుత్‌కు అంతరాయం

పులివెందుల రూరల్ : ఈనెల 5వ తేదీ పాత బస్టాండ్‌లో ఉన్న పద్మావతి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం స్వామి వారి రథం ఊరేగింపు సందర్భంగా విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ జగదీశ్వరరెడ్డి తెలిపారు. అమ్మవారి శాలవీధి, మిస్సమ్మ బంగ్లా, పాత గంగిరెడ్డి హస్పిటల్ వీధి, పూలఅంగళ్లు, మెయిన్‌రోడ్డు, బాలికలు పాఠశాల తదితర ప్రాంతాలలో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్‌కు అంతరాయం ఉంటుందన్నారు. పట్టణ ప్రజలు సహకరించాలన్నారు.

నివాళి



సుశీలమ్మకు నివాళులర్పిస్తున్న ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి

కమలాపురం : కమలాపురం మార్కెట్ యార్డు చైర్మన్, వైఎస్సార్ సీపీ టౌన్ కన్వీనర్ ఎస్‌సీ పుల్లారెడ్డి తల్లి సుశీలమ్మ గురువారం మృతి చెందడంతో ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి శుక్రవారం పుల్లారెడ్డి నివాసానికి చేరుకుని సుశీలమ్మ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

ప్రజలు సుభిక్షంగా ఉండాలన్నదే సీఎం లక్ష్యం

కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



ప్రజల సమస్యలను వింటున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

సింహాద్రిపురం : ప్రజలు సుభిక్షంగా ఉండాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. సింహాద్రిపురం మండలం చవ్వారిపల్లె, దేవతాపురం గ్రామాల్లో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటికీ వెళుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ వారికి బుక్‌లెట్‌ను అందజేశారు. అనంతరం ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సోయాబీన్ పంటను పూర్తిగా నష్టపోయామని.. ఆ పంటకు ఇన్సూరెన్స్ వచ్చేలా చేయాలన్నారు. చవ్వారిపల్లెలో చౌడేశ్వరి అమ్మవారి గుడి వద్ద పార్కును ఏర్పాటు చేయాలని ఎంపీకి విన్నవించడంతో... ఆయన సానుకూలంగా స్పందించి పార్కు నిర్మిస్తామన్నారు. అలాగే దేవతాపురంలో చౌడమ్మ ఆలయం శిథిలావస్థకు చేరుకుందని.. దేవాలయాన్ని పునఃనిర్మించాలని స్థానికులు కోరగా.. దీనికి ఆయన స్పందించారు. దేవతాపురంలోని రామ్‌నాథ్ ఇంటి వద్ద నుంచి మురికి కాలువను కి.మీ మేర ఏర్పాటు చేయాలని ఎంపీకి విన్నవించగా.. ఎంపీ సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే మంజూరు చేయాలని కోరారు. పైడిపాలెం రిజర్వాయర్ కింద ఉన్న తోటలలో చీనీ చెట్లు, మిగతా పంటలు సాగు చేసినా కూడా జౌకులెత్తి పంట దిగుబడి రాకుండా నష్టపోతున్నామని రైతులు ఎంపీకి విన్నవించారు. ఆయన న్యాయం చేస్తామన్నారు.

శనగల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఎంపీకి వినతి :

గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమానికి వచ్చిన ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి శనగల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని మార్కెట్ యార్డు చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, ఉద్యాన శాఖ రాష్ట్ర మెంబర్ శివప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, కృష్ణారెడ్డిలతోపాటు పలువురు రైతులు వినతిపత్రం అందించారు. సింహాద్రిపురం మార్కెట్ యార్డులో శనగల కొనుగోలు కేంద్రాన్ని కమిషనర్‌తో మాట్లాడి వారం రోజుల్లో ఏర్పాటు చేయిస్తామని ఎంపీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, నెట్‌క్యాప్ డైరెక్టర్ కిశోర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల నాయకులు బ్రహ్మానందరెడ్డి, ద్వారకనాథరెడ్డి, కిశోర్‌రెడ్డి, సూర్యశేఖరరెడ్డి, మహేశ్వరరెడ్డి, సుధాకర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, జి.ద్వారకనాథరెడ్డి, శ్రీనివాసరెడ్డి, చప్పిడి బాబురెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

మండలంలోని తెలిక గ్రామంలో శనివారం జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, పాడా ఓస్డీ అనిల్‌కుమార్ రెడ్డి పాల్గొంటారని ఉప మండలాధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. అలాగే అంకాలమ్మ గూడూరులోని నూతన ఆంజనేయ విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

ప్రభుత్వ పథకాలు ప్రతి ఇంటికీ అందుతాయి

ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి



ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

మైలవరం (జమ్మలమడుగు రూరల్) : అర్హులైన ప్రతి ఇంటికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మూలే సుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మైలవరం మండలంలోని వేపరాల గ్రామంలో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని ప్రజల సమస్యలపై ఆరాతీసి పరిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు పాదయాత్రలో ఇచ్చిన హామీలే కాకుండా ఇవ్వని హామీలను కూడా మంజూరు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ప్రజలకు చేసింది ఏమీ లేదని వచ్చిన నిధులను నీరు–చెట్టు పనులు కల్పించి వారి కార్యకర్తలకే దోచిపెట్టడం జరిగిందన్నారు. 5 సంవత్సరాల కాలంలో ఒక్క సాగునీటి ప్రాజెక్టును కూడా పూర్తి చేయలేదన్నారు. కార్యక్రమంలో ఎంపిటీసీలు కుమార్, శ్రావణి, మార్కెట్‌యార్డ్ వైస్ చైర్మన్ చాపాల సుబ్బరాయుడు, మాజీ మార్కెట్‌యార్డ్ చైర్మన్ శివగుర్విరెడ్డి, మండల కన్వీనర్ ధన్నవాడ మహేశ్వరరెడ్డి, ఎంపీడీఓ వై. రామచంద్రారెడ్డి, తహసీల్దార్ తిరుపతయ్య, డిప్యూటీ తహసీల్దార్ రూపేష్, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు కుండ కొండయ్య, శ్రీనివాసులరెడ్డి, వినయ్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గండి ఆలయ మాజీ ప్రధాన అర్చకుడు మృతి



వర్తి కన్నయ్యా చార్యులు

చక్రాయపేట : గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో ప్రధాన అర్చకుడిగా పనిచేసిన వర్తి కన్నయ్యా చార్యులు(92) గురువారం రాత్రి గుండె పోటుతో మృతి చెందాడు. ఇంటిలో అస్వస్థతకు గురి కావడంతో ఆయన కుమారులు వేంపల్లె వైద్యశాలకు తీసుకెళ్లగా అప్పటికే ఆయన మృతి చెందినట్లు డాక్టరు చెప్పారని కుటుంబ సభ్యులు తెలిపారు. గత ఏడెనిమిది దశాబ్దాల కాలంగా ఆయన గండి అంజన్న సన్నిధిలో అర్చకుడిగా పనిచేస్తూ ప్రధాన అర్చకుడిగా ఎదిగారు. ఆలయ అభివృద్ధిలో ఆయన చేసిన కృషిని పలువురు గుర్తు చేసుకున్నారు. ఆయన మృతి పట్ల శుక్రవారం ఆలయ తలుపులు మూసివేశారు. అంత్యక్రియలు పూర్తయ్యాక సాయంత్రం ఆలయాన్ని శుద్ధి చేసి భక్తులకు దర్శన వసతిని కల్పించారు. ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి, దేవాదాయశాఖ కడప సహాయ కమిషనర్ శంకరబాలాజీ, మండల సమన్వయకర్త ఓబుళరెడ్డి, ఎంపీపీ మాధవీబాలకృష్ణ తదితరులు ఆయన మృతదేహం వద్ద నివాళులు అర్పించారు.

శ్రీవేంకటరమణుడి కల్యాణం కమనీయం



సతీసమేతుడైన కల్యాణ శ్రీవేంకటరమణుడు

పులివెందుల టౌన్ : పులివెందుల నడిబొడ్డున వెలసిన శ్రీవేంకటరమణస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా 7వ రోజు శుక్రవారం సాయంత్రం శ్రీవేంకటరమణస్వామి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వరదాచార్యులు స్వామివారి కల్యాణాన్ని కన్నుల పండువగా జరిపించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొత్త రవికుమార్ దంపతులతో కల్యాణం నిర్వహించారు. స్వామి కల్యాణానికి ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలను సమర్పించారు. ఉభయదారులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామి కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో తిలకించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. పగలు హనుమద్వాహనంపై, సాయంత్రం గజవాహనంపై పట్టణ పురవీధులలో ఆయన భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా ఆలయంలో ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, తోమాల సేవ, సహస్రనామార్చన, నిత్య హోమం తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు.

విద్యార్థి దశనుంచే గుర్తింపు పొందాలి



పాఠశాలలో మొక్కలు నాటుతున్న ఏపీఐఐసీ డైరెక్టర్ కె.చంద్రఓబుల్‌రెడ్డి

వేంపల్లె : విద్యార్థి దశ నుంచే ప్రతి విద్యార్థి మంచి గుర్తింపు పొందాలని ఏపీఐఐసీ డైరెక్టర్ కె.చంద్ర ఓబుల్‌రెడ్డి, ఎంపీపీ ఎస్.లక్ష్మిగాయత్రి, సర్పంచ్ శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక తల్లిశెట్టి సుబ్రమణ్యం, శేషమ్మ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో 75వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు ముందుగా పాఠశాల స్థలదాత తలిశెట్టి సుబ్రమణ్యం విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడు తూ రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధతో కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను ఏర్పాటు చేసిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధి కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారన్నారు. స్థలదాతల వారసులు సృజన్‌కుమార్, కృష్ణనందన్, శిల్పికలను శాలువతో సత్కరించారు. బాలికల ఉన్నత పాఠశాల మౌలిక వసతులకోసం సర్పంచ్ శ్రీనివాసులు రూ.20వేలు నగదును అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విజయకుమారి, రిటైర్డ్ హెచ్‌ఎం వెంకటేశంశెట్టి, ఎంపీటీసీ భారతీ, పాఠశాల చైర్మన్ గురుప్రసాద్, నాయకులు ఆదినారాయణరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రోన్ ద్వారా వైఎస్సార్ జగనన్న భూ రక్ష, భూ సర్వే



భూ సర్వేకు సిద్ధంగా ఉన్న డ్రోన్ పరికరం

చెన్నూరు : వైఎస్సార్ జగనన్న భూ రక్ష, భూ రీ సర్వేను డ్రోన్ ఫ్లై ద్వారా శుక్రవారం మండలంలోని ఉప్పరపల్లె గ్రామ పంచాయతీ దుగ్గనపల్లెలో చేపట్టినట్లు మండల సర్వేయర్ సోమశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుగ్గనపల్లె గ్రామ పొలాల్లో 1457.73 ఎకరాలలో నిర్వహిస్తున్నామని, ఇక్కడ రైతులకు సంబంధించి సుమారు 750 ఖాతాలు ఉన్నాయని తెలిపారు. ఈ సర్వేలో ఆర్థో రెక్టిఫై ఇమేజ్ (ఓఆర్ఐ) చేయడం ద్వారా భూ సర్వేకు సంబంధించిన ఫొటోలు రెండు నెలల తర్వాత వస్తాయని ఆయన తెలిపారు. అనంతరం రైతులతో సమావేశం ఏర్పాటు చేసి వారికి అవగాహన కల్పించారు. రైతులకు సంబంధించిన భూములు సరిహద్దులు, గట్లు ఈ సర్వేలో వస్తాయని ఆయన రైతులకు తెలిపారు. గతంలో భూ సర్వేకి సంబంధించి రైతులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే వారని ప్రస్తుతం అలాంటి బాధలు లేకుండా ప్రభుత్వమే రైతులకు సంబంధించిన భూములను సర్వే చేసి వారికి భూ సరిహద్దులను చూపిస్తుందన్నారు. ఇంతటి బృహత్తర కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టినందుకు రైతులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా కమిటీ అధ్యక్షుడు ఎరసాని మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ నిరంజన్‌రెడ్డి, వీఆర్వో వెంకటసుబ్బయ్య, సర్వేయర్ పవన్‌కుమార్, విలేజ్ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం కావాలి



మాట్లాడుతున్న వైఎస్ మనోహర్‌రెడ్డి

పులివెందుల టౌన్ : పులివెందుల మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధి పనులు వేగవంతం కావాలని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ వరప్రసాద్‌లు తెలిపారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వారు మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డితో కలసి సచివాలయ అమేనిటీ సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన మున్సిపల్ ఇంజనీరు సుభాష్‌చంద్రబోస్‌తో వారు మాట్లాడుతూ మున్సిపాలిటీలో జరుగుతున్న పనులు వేగవంతం ఆయ్యేలా చూడాలన్నారు. జగనన్న హౌసింగ్ కాలనీలో జరుగుతున్న ఇంటి నిర్మాణ పనులను నిర్దేశించిన విధంగా పూర్తి చేయాలని అమేనిటీ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్లు, సచివాలయ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

ఉప సర్పంచ్‌గా హేమలత

లింగాల : మండలంలోని అక్కులగారిపల్లె గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్‌గా హేమలత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎంపీడీఓ సురేంద్రనాథ్ తెలిపారు. సర్పంచ్ ఎన్నికల తరువాత ఉప సర్పంచ్ ఎన్నిక వాయిదాపడుతూ వచ్చిందన్నారు. శుక్రవారం నిర్వహించిన ఉపసర్పంచ్ ఎన్నికలలో హేమలతను వార్డు మెంబర్లు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్ విజయభాస్కర్‌రెడ్డి, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలు తెలపండి



మాట్లాడుతున్న తహసీల్దార్ మాధవకృష్ణారెడ్డి

పులివెందుల టౌన్ : త్వరలో జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని తహసీల్దార్ మాధవకృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 7 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా అందులో ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సంబంధించి సత్రం ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేశామన్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ప్రభుత్వ ఉన్నత పాఠశాల(మెయిన్)లో మూడు పోలింగ్ కేంద్రాలు, వైఎస్‌వీఆర్‌ఎం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మూడు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించగా అందుకు కొన్ని రాజకీయ పార్టీలు అభ్యంతరం తెలుపుతూ వైఎస్‌వీఆర్‌ఎం బాలికల కళాశాల కాకుండా సత్రం పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మరో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. అందుకు వారి అభ్యంతరాలను పరిగణలోకి తీసుకుని సరైన నిర్ణయం తీసుకుంటామని తహసీల్దార్ వారికి వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు డాక్టర్ వరప్రసాద్, హాల్ గంగాధర్‌రెడ్డి, రసూల్, చంద్రమౌళి, వెంకటనాథరెడ్డి, టీడీపీ నాయకులు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాంగోపాల్‌రెడ్డి, బీజేపీ నాయకులు మహేశ్వరరెడ్డి, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాసులరెడ్డి ఇతర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఏపీ మోడల్ స్కూల్ పరిశీలన



విద్యార్థులతో ఈఎండీపీ జిల్లా మేనేజర్ లక్ష్మీ నరసింహుడు

వల్లూరు : మండలంలోని గంగాయపల్లె ఏపీ మోడల్ స్కూల్‌ను ఈఎండీపీ జిల్లా మేనేజర్ లక్ష్మీ నరసింహుడు శుక్రవారం సందర్శించి పరిశీలించారు. ఎస్‌సీఈఆర్టీ మరియు సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో తొమ్మిదవ తరగతి విద్యార్థులలో 21వ శతాబ్దపు నైపుణ్యాలను మరియు వ్యవస్థాపక మనస్తత్వాన్ని అభివృద్ధి చేయుటకు పాఠశాలలో నిర్వహిస్తున్న వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమం(ఈఎండీపీ) అమలు తీరును ఆయన పరిశీలించారు. శిక్షణలో అభ్యసించిన అంశాలను గురించి విద్యార్థులతో ఆరా తీశారు. మార్చి మాసంలో జరగబోయే ప్రాజెక్ట్ ఎక్స్‌పో గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులకు వ్యవస్థాపకత ఆకాంక్ష మరియు అత్యుత్తమ కెరీర్‌ను ఎంచుకునే సామర్థ్యాలను పెంపొందించడానికి ఎంతగానో ఉపయోగపడతాయని కళాశాల ప్రిన్సిపాల్ సురేష్‌బాబు తెలిపారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్ట్‌లు ప్రదర్శించారు.

ప్రజా సమస్యల పరిష్కారం మన అందరి బాధ్యత



మాట్లాడుతున్న ఎంపీపీ మాధవీబాలకృష్ణ

చక్రాయపేట : గ్రామాల్లో నెలకొన్న ప్రజావసరాల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులతోపాటు అన్ని శాఖల అధికారులకు ఉందని ఎంపీపీ మాధవీ బాలకృష్ణ తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభాభవనంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోతున్న వేసవికాలంలో తాగునీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. వీరనారాయణపల్లెలో నీటి సమస్య తీవ్రంగా ఉందని గ్రామస్తులే ట్యాంకర్లతో నీటిని తెచ్చుకుంటున్నారని ఎంపీటీసీ సభ్యురాలు లీలావతి సభదృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన అధికారులు నాలుగు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామన్నారు. మెగా కంపెనీ వారు ఓహెచ్‌ఎస్‌ఆర్‌లను నిర్మిస్తున్నారే కానీ వాటికి క్యూరింగ్ చేయడం లేదని పలువురు సర్పంచులు సభ దృష్టికి తీసుకువచ్చారు. దీనికి తోడు పైపులైన్ల కోసం కాలువలు తవ్వి సక్రమంగా పూడ్చటంలేదని పైగా ఎక్కడ పడితే అక్కడ లీకేజీలు ఉన్నాయని సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో సిమెంటు రోడ్లు పాచిపట్టి ప్రజలు కింద పడి గాయాల పాలవుతున్నారన్నారు. మండలానికి 18 ఆర్వో ప్లాంట్‌లు మంజూరైతే వాటిలో నాలుగు మాత్రమే ప్రారంభోత్సవానికి నోచుకున్నాయని మిగిలిన వాటికి పైపులైన్ కనెక్షన్‌లు విద్యుత్ సర్వీసులు ఇవ్వక పోవడంతో అవి నిరుపయోగంగా మారాయని పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు తెలిపారు. అనంతరం ఉపాధిహామీ, పారిశుధ్యం, విద్య, వైద్యం, పశువైద్యం, సమగ్ర శిశు అభివృద్ధి శాఖ తదితరాలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దారు రాజశింహనరేంద్ర, ఇన్‌చార్జి ఎంపీడీఓ ఆనందరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు వేదమూర్తి, గఫూర్, సింగిల్ విండో అధ్యక్షుడు శేషారెడ్డి తోపాటు పలువురు సర్పంచులు ఎంపీటీసీ సభ్యులు అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

వల్లూరు : మండలంలోని పెద్ద లేబాక, బక్కిరెడ్డిపల్లె గ్రామాల సరిహద్దున నూతనంగా నిర్మించిన శ్రీ సిద్ధేశ్వరస్వామి ఆలయంలో మూడవ రోజైన శుక్రవారం శివ పార్వతుల కల్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. వేద పండితులు శేఖర్ శర్మ ఆధ్వర్యంలో గడియారం ప్రసాద్ శర్మ బృందం కల్యాణంను కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం విగ్రహ ప్రాణ ప్రతిష్ఠా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఏపీఎస్ ఆర్‌టీసీ రాష్ట్ర చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి, ఎమ్మెల్యే పీ రవీంద్రనాథ్‌రెడ్డి, వైఎస్‌ఆర్‌సీపీ మండల కన్వీనర్ అబ్బిరెడ్డి వీరారెడ్డిలు ఆలయంలో జరిగిన పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో శివకుమార్‌రెడ్డి, ఈశ్వరరెడ్డి, చంద్రారెడ్డి, రామకృష్ణారెడ్డి, పుల్లారెడ్డి, రామాంజనేయరెడ్డి, రాజారెడ్డి, బాలయల్లారెడ్డి, శంకర్‌రెడ్డి, సిద్దారెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దూరం



ర్యాలీలో పాల్గొన్న వైద్య అధికారులు

ఎర్రగుంట్ల : మలేరియా, డెంగ్యూ జ్వరాలు రాకుండా నివారించడానికి పరిశుభ్రత పాటించాలని కమలాపురం మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగలక్ష్మిరెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణ పరిధిలోని న్యూకాలనీలో వ్యాధుల నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. వారానికి ఒకసారి ఇళ్లలోని తొట్లు, కుండలు, శుభ్రం చేసుకోవాలని, వారానికి ఒక్కసారి డ్రైడే పాటించాలన్నారు. ప్రతి ఎఎన్‌ఎం వారికి కెటాయించిన ఏరియాలలో పర్యటించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సాగులో మెలకువలు అవసరం



కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జేడీఏ నాగేశ్వరరావు

చింతకొమ్మదిన్నె : పంటల సాగుకు మెలకువలు అవసరమని జేడీఏ నాగేశ్వరావు రైతులకు తెలిపారు. శుక్రవారం మండలంలోని కొలుములపల్లె రైతు భరోసా కేంద్రాన్ని ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. ఆర్‌బీకేలో రిజిష్టర్‌ను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలన్నారు. రైతులు అడిగిన పంటల వివరాలను తెలియజేయాలన్నారు. అనంతరం గ్రామంలో సాగు చేసిన వివిధ రకాల పంటలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నారాయణరెడ్డి, ఎంపీఈఓ భాగ్యమ్మ, వెటర్నరీ అసిస్టెంట్ సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

కుష్టువ్యాధిపై అవగాహన

పులివెందుల రూరల్ : పట్టణంలోని స్థానిక ముద్దనూరు రోడ్డులో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కుష్టువ్యాధిపై విద్యార్థులకు డీపీఎంఓ సుబ్బారెడ్డి అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. స్పర్శ, నొప్పిలేని తెల్ల మచ్చలు ఉంటే ప్రారంభ దశలో గుర్తించి వైద్యం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, టీబీ యూనిట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల : చిలంకూరు గ్రామంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు కుష్టువ్యాధి నివారణపై పీహెచ్‌సీ వైద్యాధికారి సాయిచరిత అవగాహన కల్పించారు.

అక్రమ ఇసుక, నాటు సారా రవాణాపై ప్రత్యేక దృష్టి

పులివెందుల రూరల్ : పులివెందుల డివిజన్ పరిధిలో అక్రమంగా ఇసుక, మద్యం తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఈబీ సీఐ రామాంజనేయులు తెలిపారు. ఆయన శుక్రవారం తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. ఇసుకతో పాటు, నాటు సారా తయారీ కేంద్రాలు, నాటుసారా విక్రయాలు జరిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.